పడిపోయిన వంతెనలమీద

# రైలు పిట్టలు

"యూర్తి"

ఆడపిట్ట ఏమండోయ్!

మగపిట్ట ఏం! ఏం!

ఆ పి మీ రైల్వేవాళ్లంతా బ్రతికారండోయ్!

మ పి ఏం సంగతి?

ఆ అరయలూరు ప్రమాదానికి మీ రెవ్వరూ బాధ్యులుగారట విపరీతమైన వానల వల్ల ఆ వంతెన కాస్తా పడిపోయిందట అది కోర్టువారి అభిప్రాయమని పేపరులో వేశారు

మ పోనీలే! చనిపోయినవాళ్లు దురదృష్ట వంతులు.

ఆ అయితే! బ్రతికున్న యీ యింజనీయర్లంతా అదృష్టవంతులేగా!

మ తప్పకుండా!

ఆ ఏమిటండీ యీ విపరీతము!

మ విపరీతమేముంది! అది న్యాయ మూర్తుల తీర్పు

ఆ ఒక మాదిరి వానలు కురిసే మన దేశంలోనే ఏడాదికి మూడు వంతెనలు పడిపోతుంటే, యింకా 'విపరీతంగా వానలు కురిసే దేశాలలో ఎన్ని బ్రిడ్జీలు పడిపోవాలి, ఎంత మంది చావాలండీ?

మ అదీ జరుగవచ్చు! జరిగిన తరువాత గాని లెక్కలు తేలవుగా!

ఆ దీనికంతా కారణమేమిటంటారు?

మ ఏ కారణం లేకపోతే కర్మ అనేది ఒకటుందిగా! చచ్చిపోయిన వాళ్లకర్మ అనుకుందాం!

ఆ అట్లా అని వూరుకోవలసిందేనా?

మ వూరుకుంటున్నారా! యిప్పుడు చూడు- బాగున్న బ్రిడ్జీలకు, బాగుండని బ్రిడ్జీలకు కూడా, సున్నం సిమెంటు పూసి రిపేరు చేస్తున్నారా! చాలా బ్రిడ్జీలమీద రైళ్ళు నెమ్మదిగా నడిపిస్తున్నారు. అందుకేగా రైళ్లన్నీ లేటుగా రావటం!

ఆ అయితే రైళ్ళు లేటుగా రావటమో, లేక పోతే బ్రిడ్జిలు పడిపోవటమో తప్పదంటారు. యింత సిబ్బందీ-యింతమంది ఆఫీసర్లు వుండి కూడా యిదేనటండీ చేసేది?

మ అదేగా యిప్పుడు మన దేశానికి పట్టుకున్న బాధ! అన్ని డిపార్టుమెంటులలోనూ అధికమయిన సిబ్బంది, రెట్టింపు ఆఫీసర్లు. మూడు రెట్లు జీతాలు నాలుగురకాల యూనియన్లు. ఆఫీసర్లకు ఒక యూనియను గుమాస్తాలకు ఒక యూనియను పనివాళ్లకు ఒక యూనియను ఎవరికి పనికిరానిది, అందరికి సంబంధించినది మరొక యూనియను పనివాళ్లకు పనిచెయ్యకుండా జీతాలు రావాలి. పనికి రాకపోతే "ఆబ్సెంటు" వేయకూడదు. ఒక వేళ వేస్తే సమ్మెచేయటమే గుమాస్తాలు అంతా ఎన్ జీ వోలు పని చేయించవలసిన బాధ్యత వాళ్లది క్రిందివాళ్లు పనిచేయకపోతే పైవాళ్లకు రిపోర్టు చేయటం-కాళ్ళు చాపుకుని కూర్చోటం ఇక పైవాళ్లు అంటే ఆఫీసర్లు, యిందులో చాలా మంది మధ్యతరగతిలోనుంచి ప్రామోట్ అయిన వాళ్లు వాళ్లకు వాళ్ల వుద్యోగం కాపాడుకోటంలో వుండే శ్రద్ధ మనమీద వుంటుందా? గట్టి చర్య తీసుకుంటే మరి యూనియను వాళ్లు తిరగబడతారుగా. కాబట్టి యధార్ధాన్ని దాచిపెట్టి రిపోర్టుల మూలంగా పై ఆఫీసర్లను తృప్తిపరచి కాలం గడపటమే వాళ్లు చెయ్యగలిగింది ఆ పైఆఫీసర్లు అంటావు. వారంతా పెద్దపెద్ద డిగ్రీలు పుచ్చుకున్నవారు క్రిందివారి రిపోర్టులను చక్కగా చదవగలిగిన వారు అసలు విషయం చూసేందుకు తీరికేదీ?

ఆ అయితే మీరు చెప్పేది ఏమిటింతకూ? పనివాళ్ళు పనిచేయటం లేదని ఆఫీసర్ల అజమాయిషీ లేదని అంటారన్నమాట!

మ అజమాయిషీ లేకపోవటమేం ఖర్మం అజమాయిషీ లేకపోతే టి ఏ లు రావద్దూ! పని జరగటములేదని తెలుసుకుని కూడా యేమీ చేయలేక పోవటమే కారణం ఒక చిన్న ఉదాహరణ చెపుతా విను పది పది హేను సంవత్సరాలు క్రిందట మనమంతా ప్రయాణాలు చేస్తుంటే ఎక్కడ పడితే అక్కడ పనివాళ్లు (వాళ్ళనే గ్యాంగువాళ్లని అంటారులే) గడ్డపారలు వగైరాలు పుచ్చుకుని ఎండనక వాననక యేదో ఒక పని చేస్తూ వుండేవాళ్లు ఆఖరికి రైలురోడ్డుపై కంకరరాళ్లు కూడా రెండువైపులా వరుసగా పేరుస్తూ వుండే వాళ్లు యిపుడు అటువంటిది యేమన్నా చూడగలుగుతున్నామా? అప్పటికంటే యిప్పుడు పనివాళ్లూ ఎక్కువే! జీతాలూ ఎక్కువే!! ఆఫీసర్లూ ఎక్కువే!!! కంకరరాళ్లు పేర్చటంలో గొప్పదన మేమిటని నవ్వుకుంటా వేమో! అందులోనేవున్నది గొప్పదనమంతాను అందువల్ల రాతికి రాతికి మధ్యనున్న సూక్ష్మ రంధ్రములలోనున్న తప్పఒప్పలు కూడా పని వాడికి అవగత మవుతాయన్నమాట పార పాటు జరగటానికే అవకాశం వుండదు! అందుకే పూర్వపు దొరలు ఆ పద్ధతి పెట్టారు. అప్పుడు అన్నీ బాగానే వున్నాయి ఇప్పుడు ఆ పద్ధతులు వెగటుగా వున్నాయి అందుకే అనుభవిస్తున్నాము!

ఆ ఇక ఈపరిస్థితికిగత్యంతరంలేదంటారా?

మ లేకేం! ప్రతి కార్మికుడు తన బాధ్యత గుర్తించిన నాడే దానికి విముక్తి ఇతర దేశాలలో బాధ్యతాయుక్తంగా పని జరిపి, తమ హక్కుల కోసం పోరాడతారు కార్మికులు మన దేశంలో పని ఎల్లాగున్నా ఆందోళన మాత్రం అధికం అది దేశ సౌభాగ్యానికే గొడ్డలిపెట్టన్న విషయం-పనివాళ్లకూ లేదు ఆఫీసర్లకూ లేదు ఆ యూనియన్ అధినేతలకు అంతకన్నాలేదు. మన మంత్రి పుంగవులకుగాని ప్రభుత్వానికి గాని ప్రణాళికలు వేయటమేగాని అమలు జరుగుతున్న విషయం పట్టదు అది జరిగిన నాడే మనకు మోక్షం అంతవరకూ మన పరిస్థితి యింతే

ఆ రామ రామ! సబ్‌కో సన్మతి దే భగవాన్!

★

---

(4 వ పేజీ తరువాయి)

"నామినేషన్ పారేస్తే సరి చివరి రోజుకి రెడ్డి లొంగిరాడంటావా?"

"ఏమో కాంగ్రెసువాళ్లకి మహ ధైర్యంగా వుందిలే ఏమయినా వాళ్ల వోట్లు చీల్చాలయ్యా నేను"

"నేనూ అదేగా చూసేది! ఒకపని చెయ్యి!"

"ఏమిటి?" ఆత్రుతతో అడిగాడు

"ఇద్దరం పారేద్దాం నామినేషన్లు చివరకి చెరో రెండువేలయినా అథమం ముట్టకపోవు పోనీ వెయ్యి వొస్తే మటుకు నష్టమేముంది? రెడ్డి కేం తెగులా! రెండు లక్షల ఆస్తి వుంది."

"సరెకాని ...అలాగే పారేద్దాం"

ఇద్దరూ నామినేషన్లు పారేశారు. పనిలోపని సుబ్బయ్య చేత కూడా ఒకటి పడేయించారు

ఉపసంహరణ గడువు పూర్తి కావస్తోంది పత్రికలో ఒక రోజు వార్త పడింది.

"జాతీయ క్షేమం దృష్ట్యాను, బాపూజీ ఆశయమైన సర్వోదయ, సోషలిస్టు, అహింసాయుత, గ్రామీణ సహకార శ్రేయోరాజ్య సాధనయే తన లక్ష్యంగా, కాంగ్రెసు ప్రకటించి వున్నందునను, కమ్యూనిస్టుల ప్రజాసోషలిస్టుల అక్రమ పొత్తును భేదించేటందుకున్ను నియోజక వర్గంనుంచి లోక్ సభకు నామినేషన్ దాఖలు చేసిన శ్రీ చలమయ్య తమ అభ్యర్థి పత్రాన్ని వుపసంహరించుకున్నారు"

వార్త చదివిన పరంధామయ్య ఆశ్చర్య పోయాడు. వెనుకటి రోజు సాయంత్రం వరకు యీ సంగతి తెలియనేలేదు

"ఏం పంతులూ?" సుబ్బయ్య చేతులు జోడించాడు.

"రా సుబ్బయ్యా."

"ఎలాగుంది పరిత్తితి?"

"మన ప్రయాణం తప్పదు నీ కులంవాళ్ల వోట్లు వీలయితే మరోవెయ్యి చీల్చుకో కాంగ్రెసు నుంచి"